నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 30 అక్టోబర్ 2024 | SURYAPET

## బీఆర్ఎస్ పోరాటంతోనే విద్యుత్ చార్జీల పెంపు వెనక్కి..

విద్యుత్ చార్జీలను పెంచి ప్రభుత్వం ప్రజలపై వేయాలనుకున్న రూ. 18,500 వేల కోట్ల భారాన్ని ఆపడంలో తమ పార్టీ విజయం సాధించిందని బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు చోట్ల పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేల పోరాటం, వినతులతో ప్రభుత్వం, ఈఆర్సీ విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయంపై వెనక్కి తగ్గిందని తెలిపారు.



నూతనకల్ మండల కేంద్రంలో పటాకులు కాల్చి హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



పగిడిమర్రిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

# జిల్లా అంతటా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీనే

**నుడా పరిధిలోకి నల్లగొండలోని 7 మున్సిపాలిటీలు, 502 గ్రామాలు**

**సుడా పరిధిలో సూర్యాపేటలోని 5 మున్సిపాలిటీలు, 264 గ్రామాలు**

- తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- బీఆర్ఎస్ హయాంలోనే నల్లగొండ కేంద్రంగా 'నుడా' ఏర్పాటు
- ప్రస్తుతం జిల్లా అంతటికీ విస్తరణపై సందేహాలు
- ఇక అనుమతులన్నీ యూడీఏ పరిధిలోకి.
- గ్రామాల్లో అభివృద్ధి నిధులపై నీలినీడలు



గతంలో ప్రధాన పట్టణాలు, వాటికి ఆనుకుని ఉండే కొన్ని గ్రామాలతోనే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(యూడీఏ) ఏర్పాటు చేసేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు ఒక్కో జిల్లాను ఒక్కో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కిందకు తీసుకువస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం వెలువరించిన ఉత్తర్వుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాను మూడు అర్బన్ అథారిటీలుగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే నల్లగొండ కేంద్రంగా గత కేసీఆర్ సర్కార్ నీలగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నుడాను నల్లగొండ జిల్లా అంతటా విస్తరిస్తూ తాజాగా ఆదేశిలిచింది. ఇక సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలకు కొత్తగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసింది. అయితే ఉన్నట్టుండి జిల్లాలకు జిల్లాలనే ఇందులో చేర్చడం వల్ల అదనంగా చేకూరే ప్రయోజనాలు ఏమిటన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

– నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్29(నమస్తే తెలంగాణ)

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించి, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ప్రధాన పట్టణాలను అభివృద్ధి చేసేందుకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని గత ప్రభుత్వాలు తెరపైకి తెచ్చాయి. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలోకి తీసుకువచ్చి అభివృద్ధిని విస్తరించిన తరహాలోనే రాష్ట్రంలోని ఇతర ప్రధాన పట్టణాలకు సైతం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేస్తూ వచ్చారు. ఇలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం వరకు రాష్ట్రంలో 9 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు రూపుదిద్దుకున్నాయి. ఇందులో ఉమ్మడి జిల్లాలోనూ నల్లగొండ జిల్లా కేంద్రంగా నీలగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)ను కేసీఆర్ సర్కార్ ఏర్పాటు చేసింది. 2022 జనవరి 31న జీఓ నంబర్ 16 ద్వారా నుడా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అప్పుడు నల్లగొండ మున్సిపాలిటీతో పాటు నల్లగొండ మండలంలోని 22 గ్రామాలు, కనగల్‌లోని 6 గ్రామాలు, తిప్పర్తిలోని 9, కట్టంగూర్‌లో 1, నార్కట్‌పల్లిలో 2, నకిరేకల్‌లోని 2 గ్రామాలతో 540 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో నుడా రూపుదిద్దుకుంది. నుడా పరిధిలో నిధుల సమీకరణ కోసం బెటాలియన్‌కు ఎదురుగా ఉన్న రాజీవ్ స్వగృహ స్థలాన్ని అభివృద్ధి చేసి వేలం వేశారు. ఇక ఇదే సమయంలో నల్లగొండ అభివృద్ధి కోసం కూడా ప్రత్యేకంగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం విస్తృతంగా నిధులిచ్చి ప్రోత్సహించింది.

### నల్లగొండ నుడా...

నీలగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, నల్లగొండగా నుడాను విస్తరిస్తున్నట్లు తాజాగా ప్రభుత్వం ఉత్వర్వులు ఇచ్చింది. నల్లగొండ నుడా పరిధిలోకి గతంలో ఉన్న 42 గ్రామాలతోపాటు అదనంగా 502 గ్రామాలను ఇందులో చేర్చింది. దీంతో మొత్తం జిల్లా పరిధిలోని 544 గ్రామాలు నుడా పరిధిలోకి వచ్చినట్లైంది. జిల్లా పరిధిలో ఇప్పటికే ఉన్న నల్లగొండతోపాటు మిగతా మిర్యాలగూడ, నకిరేకల్, చిట్యాల, చండూరు, హాలియా, నందికొండ, దేవరకొండ మున్సిపాలిటీలకు విస్తరిస్తూ 32 మండలాల్లోని మేజర్ గ్రామాలన్నింటినీ ఇందులోకి తీసుకొచ్చారు. జిల్లాలో మొత్తం 844 గ్రామ పంచాయతీలు కాగా మరో 300 గ్రామాలు మాత్రమే నుడా పరిధిలోకి రాకుండా ఉన్నాయి. చందంపేట మండలంలోని కంబాలపల్లి గ్రామాలను సైతం నుడా పరిధిలోకి తీసుకురావడం గమనార్హం. నుడా, నల్లగొండ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

### సుడాగా సూర్యాపేట జిల్లా

సూర్యాపేట జిల్లాలోని 23 మండలాలతోపాటు ఐదు మున్సిపాలిటీలతో కలిపి సూర్యాపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలతో పాటు అన్ని మండలాల పరిధిలోని 264 మేజర్ గ్రామాలను సుడా పరిధిలోకి తీసుకువచ్చారు. ఇక్కడ మొత్తం 486 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మరో 222 గ్రామాలను మాత్రం సుడా పరిధిలోకి తీసుకోలేదు. గతంలో ఈ జిల్లాలో ఎలాంటి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ లేదు. కొత్తగా సుడాగా ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా యాదాద్రిభువనగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(యూడా)ను కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇప్పటికే పలు మున్సిపాలిటీలు గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా తాజాగా ఆలేరు, మోత్కూర్ మున్సిపాలిటీలతోపాటు 144 గ్రామాలను యుడా పరిధిలోకి తీసుకువచ్చారు. ఈ జిల్లాలోని తుర్కపల్లి, సంస్థాన్ నారాయణపురం మండలాలను మాత్రం ప్రస్తుతానికి వదిలేశారు. త్వరలోనే ఈ మండలాలను సైతం హెచ్ఎండీఏ పరిధిలో చేర్చే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

### ప్రయోజనాలేంటో...?

ఇప్పటికే జిల్లా యూనిట్‌గా అభివృద్ధి నమూనాలు అమలులో ఉండగా తాజాగా ఏర్పాటు చేస్తున్న అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలతో ప్రయోజనాలు ఏంటన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మున్సిపల్, గ్రామ పంచాయతీల అధికారాలకు కత్తెర పడనుందానన్న అనుమానాలు మొదలయ్యాయి. బిల్డింగ్ పర్మిషన్లు, లేఅవుట్ల అనుమతులన్నీ ఇక ముందు అథారిటీలకు అప్పజెప్పితే తమ ప్రాంతాల అభివృద్ధికి నిధుల పరిస్థితి ఏంటన్నది సందేహాస్పదంగా మారనుంది. గతంలో ప్రధాన పట్టణాల అభివృద్ధి కోసం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా భవిష్యత్తు అవసరాలు, పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేవారు. దీని ద్వారా ప్రణాళిక బద్ధంగా అభివృద్ధికి ఆస్కారం కలిగేది. దీంతో పాటు అథారిటీల పరిధిలోనే నిధులను సమకూర్చుకునే అవకాశాలు ఉండేవి. దీంతో పాటు బిల్డింగ్ పర్మిషన్లు, లేఅవుట్ల అనుమతులన్నీ కూడా అథారిటీల పరిధిలోకి వస్తాయి. అయితే అథారిటీ పరిధి కొంత మేరకు అయితేనే ప్రత్యేకంగా అభివృద్ధికి ఆస్కారం ఉండేదన్న చర్చ ఉంది. కానీ ప్రస్తుతం జిల్లా అంతటికీ దీని పరిధిని విస్తరించడం వల్ల అభివృద్ధి పరంగా కొత్తగా ఏర్పడే అవకాశాలు ఏంటన్నది తేలాల్సి ఉంది. ఇప్పటివరకు 800 చదరపు గజాల లోపు నిర్మాణాలకు గ్రామ పంచాయతీల పరిధిలోనే అనుమతులు ఇస్తున్నారు. ఆపైన బిల్డింగ్‌లు, లేవుట్లకు అనుమతులు మాత్రం డీటీసీపీ నుంచి తీసుకుంటున్నారు. ఇక ముందు ఇది ఇలానే కొనసాగుతుందా? అన్ని అనుమతులు అథారిటీల పరిధిలోకి వస్తాయా? వస్తే స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపులు ఎలా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

## రూ.600 కోట్లతో రోడ్ల అభివృద్ధి

- రెండు నెలల్లో ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ సిటీ/నల్లగొండ రూరల్, అక్టోబర్ 29 : రాష్ట్రంలో ఎక్కడా మట్టి రోడ్డు అన్నదే లేకుండా రహదారులు నిర్మిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలం పగిడిమర్రి గ్రామం సమీపంలోని సోమన్న వాగు వద్ద రూ.38 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మూడు డబుల్ రోడ్లు, హైలెవల్ బ్రిడ్జి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే నల్లగొండ మండలం ముశంపల్లి పంచాయతీ పరిధిలోని ఐతవారి గూడెంలో సీసీ రోడ్డు పనులకు కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిలో భాగంగా రూ.30 వేల కోట్ల వ్యయంతో రీజినల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులకు రూ.600 కోట్లు మంజూరు చేశామని, శ్రీశైలం, దేవరకొండ రహదారి అటవీ ప్రాంతంలో ఉన్నప్పటికీ అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కనగల్ జంక్షన్‌ను రూ.8 కోట్లతో విస్తరిస్తున్నామన్నారు. దర్వేశిపురం రోడ్డు వెడల్పు పనులు నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని, తిప్పర్తి జంక్షన్‌ను రూ.9 కోట్లతో వెడల్పు చేసే పనులు ప్రారంభించామని తెలిపారు. రూ.38 కోట్లతో చేపట్టిన కొత్తపల్లి, పగిడిమర్రి, అనంతారం డబుల్ రోడ్డు పనులు బుధవారం ప్రారంభించి పది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. పగిడిమర్రి బ్రిడ్జితోపాటు చెక్ డ్యామ్‌లు కూడా నిర్మిస్తామని తెలిపారు. వారం రోజుల నుంచి బ్రాహ్మణవెల్లెంల లిఫ్ట్ పనులు నడుస్తున్నాయని, మూడు మాసాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు ఇవ్వనున్నామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం బడ్జెట్‌ను రూ.4,600 కోట్లకు పెంచి అమెరికా నుంచి ఇంజిన్ బేరింగ్ తెప్పించి రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 చొప్పున ఇండ్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. నవంబర్‌లో ప్రభుత్వ వైద్యశాలలతోపాటు బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి ద్వారా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎవరు ఏమి మాట్లాడినా మూసీ శుద్ధీకరణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మిర్యాగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్, పంచాయతీ రాజ్ ఈఈ తిరుపతయ్య, ఏఈ రమేశ్, నాయకులు రామచంద్రారెడ్డి, భరతం వెంకటేశం, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, గోళి జగాల్‌రెడ్డి. నర్సిరెడ్డి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, బైరెడ్డి వెంకట్‌రెడ్డి, బీరం స్వాతి కరుణాకర్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, గుమ్మల మోహన్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం

- ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ నేతల వినతితోనే విద్యుత్ చార్జీల పెంపును విరమించుకున్న ఈఆర్సీ
- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, అక్టోబర్ 29 : రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, సీఎం రేవంత్‌రెడ్డి అవగాహన రాహిత్యం, అనాలోచిత నిర్ణయం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో 163 యాక్ట్‌ను అమలు చేయడం చూస్తుంటే శాంతిభద్రతలు లోపించినట్లు అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం అభద్రతా భావంతో ఉందని, మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడంతో పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. హక్కుల సాధన కోసం పోరాడుతున్న స్పెషల్ పోలీసులను 39 మందిని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి చవకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. హైడ్రా అనేది అనాలోచిత నిర్ణయమని, ధనికులకు ఒక విధంగా, పేదలకు ఒక విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ధనికుల ఇండ్ల జోలికి వెళ్లకుండా పేదల ఇండ్లను మాత్రమే కూలగొడ్తున్నారని విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో విద్యుత్ చార్జీలు ఎన్నడూ పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి పది నెలలు అయినా విద్యుత్ చార్జీలు పెంచాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌కు లేఖలు రాసిందన్నారు. బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు విద్యుత్ చార్జీల పెంపును తీవ్రంగా వ్యతిరేకించారని, వారు ఇచ్చిన వివరణను పరిగణలోకి తీసుకున్న ఈఆర్సీ చైర్మన్ చార్జీల పెంపును విరమించుకున్నారని చెప్పారు. అన్నారు. ఇది బీఆర్ఎస్ పార్టీ విజయమన్నారు. చార్జీల పెంపును విరమించుకున్నందున ఈఆర్సీ చైర్మన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబర్ 29 : జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఉదయాదిత్య భవన్‌లో మంగళవారం ఆయా అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్లు అన్ని అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండల స్థాయిలో ఎన్యుమరేటర్లకు చెప్పి క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా సర్వే చేపట్టాలని తెలిపారు. వివరాల సేకరణ అనంతరం డేటా ఎంట్రీ నిర్వహించాలన్నారు.

### ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వానకాలం ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో పౌర సరఫరాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమకొలిచే యంత్రాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని, ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. 2022–23, 2023–24 సీజన్‌లకు సంబంధించిన సీఎమ్మార్‌ను వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, సీపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డీఎం హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుడాలి

- బీసీ గురుకులాల ఏజీఓ లింగయ్య

మిర్యాలగూడ రూరల్, అక్టోబర్ 29 : గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలని మహాత్మా జ్యోతిబాయి పూలే బీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ లింగయ్య సూచించారు. మండలంలో శ్రీనివాసనగర్‌లో ఉన్న దామరచర్ల బీసీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆర్‌సీఓ పద్మ, ప్రిన్సిపాల్ ఉమాదేవి, క్రీడా ఇన్‌చార్జి వి.రజిత, వివిధ పాఠశాలల పీడీలు, పాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్రీడా పోటీల్లో విజేతలు వీరే

అండర్–19 కబడ్డీలో విన్నర్‌గా అనంతగిరి గురుకుల పాఠశాల, రన్నర్స్‌గా కొండమల్లేపల్లి గురుకులం, ఖోఖోలో విన్నర్స్‌లో దామరచర్ల గురుకులం, రన్నర్స్‌గా మోటకొండూరు గురుకులం, వాలీబాల్‌లో విన్నర్స్‌గా అనంతగిరి గురుకులం, రన్నర్స్‌గా నల్లగొండ గురుకులం విద్యార్థులు నిలిచారు.

### అండర్ - 14 విభాగంలో

కబడ్డీలో విన్నర్స్‌గా నల్లగొండ గురుకులం, రన్నర్స్‌గా వలిగొండ గురుకులం, ఖోఖోలో విన్నర్స్‌గా మునుగోడు గురుకులం, రన్నర్స్‌గా నల్లగొండ గురుకులం, వాలీబాల్‌లో విన్నర్స్‌గా నల్లగొండ గురుకులం, రన్నర్స్‌గా వలిగొండ గురుకులం, చెస్‌లో విన్నర్స్‌గా తుమ్మడం గురుకులం, రన్నర్స్‌గా చందుపట్ల గురుకుల విద్యార్థులు నిలిచారు. 17 బహుమతులు గెలుచుకొని ఓవరాల్ చాంపియన్‌గా మునుగోడు గురుకుల పాఠశాల విద్యార్థులు నిలిచారు. వ్యక్తిత చాంపియన్‌గా పి.వైష్ణవి నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.



మిర్యాలగూడ రూరల్ : విజేతలకు బహుమతులు అందిస్తున్న బీసీ గురుకుల ఏజీఓ లింగయ్య

## నవంబర్ 2 నుంచి గుట్టలో కార్తీక మాసోత్సవాలు

- రోజుకు ఆరు బ్యాచ్‌లుగా వ్రతాలు
- వివరాలు వెల్లడించిన ఈఓ భాస్కర్‌రావు



వివరాలు వెల్లడిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, అక్టోబర్29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాసోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్ రావు తెలిపారు. కొండపైన ఈఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. తెలంగాణ అన్నవరంగా పేరు పొందిన యాదగిరిగుట్ట క్షేత్రంలో కార్తీక మాసంలో అత్యధిక వ్రతాలు జరుగుతాయని, అందుకనుగుణంగా సకల ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొండ కింద వ్రత మండపంలో 6 బ్యాచ్‌లను నిర్వహిస్తామన్నారు. మొదటి బ్యాచ్ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, 2వ బ్యాచ్ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, 3వ బ్యాచ్ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 4వ బ్యాచ్ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు, 5వ బ్యాచ్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు, 6వ బ్యాచ్ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. కార్తీక శుద్ధ పౌర్ణమి సందర్భంగా నవంబర్ 15న 8 బ్యాచ్‌ల్లో వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 5.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వ్రతాలు కొనసాగనున్నట్లు వెల్లడించారు. రూ. 800 రుసుముతో వ్రతానికి కావాల్సిన సామగ్రి ఆలయ అధికారులే సమకూర్చుతారని, అందుకనుగుణంగా వ్రత మండపాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. వ్రత మండపం ప్రాంతంలో సీసీ రోడ్లు, పార్కింగ్ టైల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. వాహన పార్కింగ్‌ను తీసివేస్తున్నట్లు తెలిపారు. వాలెట్ పార్కింగ్‌ను తొలిసారిగా తీసుకొస్తున్నామన్నారు. వ్రత మండపం ప్రాంతంలో స్వామివారి ప్రసాద విక్రయశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్రత మండప ప్రాంతంలో చుట్టూ ఎల్ఈడీ స్క్రీన్లను ఉంచనున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ట్రై సైకిల్‌ను అందుబాటులో ఉంచామన్నారు. గత కార్తీకమాసంలో 18,203 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారని, ఈ సారి ఆ సంఖ్య మరింతగా పెరిగేందుకు కృషి చేస్తామని చెప్పారు. గతంలో మాదిరిగా ప్రత్యేక వ్రతాలు ఉండవని తెలిపారు. పాతగుట్ట ఆలయంలో 5 బ్యాచ్‌లుగా వ్రతాలను నిర్వహిస్తామన్నారు.

### దీపారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు

కార్తీకమాసం సందర్భంగా దీపారాధన చేసే భక్తులకు ప్రత్యేకమైన స్టాళ్లను ఏర్పాటు చేశామని ఈఓ వెల్లడించారు. కొండపైన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద, ఉత్తర రాజగోపురం ఎదురుగా, కొండపైన విష్ణు పుష్కరిణి వద్ద దీపారాధన చేసుకునే వెలుసుబాటు కల్పించామన్నారు. కొండ కింద లక్ష్మీ పుష్కరిణి వద్ద, సత్య నారాయణ స్వామి వ్రత మండపం, స్వామివారి వైకుంఠ ద్వారంతోపాటు పాతగుట్ట ఆలయం వద్ద దీపారాధన స్టాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

### దీపావళి రోజున ఆలయ వేళల్లో మార్పులు

దీపావళి పర్వదినం పురస్కరించుకొని గురువారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఉదయం నిత్య కైంకర్యంలో స్వామివారి సుప్రభాత దర్శన టికెట్లను రద్దు చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 3.30 నుంచి 4.00 గంటల వరకు స్వామివారి సుప్రభాతం, 4.15 నుంచి 4.45 గంటల వరకు స్వామి, అమ్మవార్ల మంగళహారతులు, 4.45 నుంచి 6.30 గంటల వరకు తిరువారాధన, బాలబోగం ఆరగింపు, 6.30 నుంచి 7.30 గంటల వరకు స్వామివారికి నిజాభిషేకం, ఉదయం 7.30 గంటలకు సహస్రనామార్చన, సుదర్శన నారసింహ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8.15 గంటల నుంచి స్వామివారి సర్వ దర్శనాలను ప్రారంభిస్తామని చెప్పారు.



ఎంపికైన ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ బాలికల జట్టు

## హ్యాండ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

నల్లగొండ రూరల్,అక్టోబర్ 29: ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో సబ్ జూనియర్స్ బాలికల హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డి.విమల పోటీలను ప్రారంభించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 2 నుంచి 4 వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, పీఈటీలు పాల్గొన్నారు.